క్లుప్తంగా

దివీస్ సహకారం అభినందనీయం



దివీస్ ప్రతినిధులతో ప్రధాన వైద్యులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రిలో పనులను పూర్తి చేసేందుకు దివీస్ సంస్థ అందించిన సహకారం అభినందనీయమని ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన వైద్యుడు ఫణికుమార్ అన్నారు. రూ.12 లక్షలతో అసంపూర్తిగా ఉన్న ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే గదులను పూర్తి చేసిన సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రిలో పనులు అసంపూర్తిగా ఉండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న యాజమాన్యం ఎంతో సహకరించిందన్నారు. యాజమాన్య ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో దివీస్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నర్సింహ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాస పోలమాంబకు విశేష అలంకరణ



ఎరుపు, నలుపు పూసల అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను మంగళవారం ఎరుపు, నలుపు పూసదండలు, గజమాల, పువ్వుల దండలు, వేపాకులతో అలంకరించారు. శింగనబంధ పంచాయితీ కృష్ణంరాజుపేట గణపతి వీధి సభ్యులు ఈ అలంకరణకు సహాయ సహకారాలు అందించారు. మజ్జివలసకు చెందిన తుపాకుల అప్పలరాసయ్య, రాసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇంగ్లిష్ ల్యాబ్‌కు ఫర్నిచర్ వితరణ



ఇంగ్లిష్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ శ్రీరామ్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట అంబేడ్కర్ ఎలిమెంటరీ పాఠశాలకు ఇంగ్లిష్ ల్యాబ్ నిమిత్తం కలిగొట్ల స్విగ్రశ్రీ ఫౌండేషన్ రూ.10వేల విలువైన ఫర్నిచర్‌ను మంగళవారం అందించింది. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఈ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని మొకర పద్మావతి, ఉపాధ్యాయులు జి.ప్రసాద్, డబ్బీరు రమేష్, లీలామణి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



పూర్వ విద్యార్థులు అందించిన ఫర్నిచర్

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీహైస్కూల్‌కు చెందిన 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సైన్స్ ల్యాబ్ కోసం సుమారు రూ.10వేల విలువైన ఫర్నిచర్‌ను మంగళవారం అందించారు. పూర్వ విద్యార్థులు టి.కనకరత్నం, పి.రమాదేవి, సిహెచ్.అప్పలరాజు, సింగవరపు వెంకటరమణ, తిప్పల రమేష్, పల్లా శ్రీను, తమ్మిన సురేష్, కె.కుమారి చేతుల మీదుగా ఈ ఫర్నిచర్‌ను పాఠశాల యాజమాన్యానికి అందించారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీరు తరలించేస్తున్నారు

ఐదేళ్ల క్రితం ఆ ప్రాంతంలో బోరు వేస్తే 40 నుంచి 50 అడుగులకే నీరు పడేది. సుమారు 70 అడుగులతో సురక్షితమైన నీరు అందేది. కానీ ఇప్పుడు పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. బోరు వేస్తే వంద అడుగులకు కూడా నీరు పడటం లేదు. ఇష్టానుసారం బోర్ల తవ్వకం, అనుమతుల్లేకుండా నీటి రవాణాతో పరిస్థితి ఇంతవరకు వచ్చింది. నగర శివారులోని ఎండాడ వద్ద దుస్థితి ఇది..

- ఎండాడలో మంచినీటి అక్రమ రవాణా
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- స్థానికులను వేధిస్తున్న నీటి సమస్య
- పట్టించుకోని అధికారులు



నీటిని తరలించేందుకు సిద్ధం చేస్తున్న ట్యాంకర్లు



తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్యాంకర్

కొమ్మాది: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఎండాడ ప్రాంతంలో మంచినీటి సమస్య స్థానికులను ఇబ్బంది పెడుతోంది. ఎండాడ ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, దుర్గానగర్ ప్రాంతాలు అనుసంధానంగా ఉంటాయి. ఈ ప్రాంతాల్లో నివాసాల మధ్య కొన్నేళ్లుగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి నీటిని తోడేస్తుంటే, మరోవైపు ఓ వ్యక్తి ఏకంగా భారీ ట్యాంకులతో రాత్రి సమయాల్లో అక్రమంగా మంచినీటి రవాణా చేస్తున్నారు. సెలవు దినాల్లో, రాత్రి సమయాల్లో అధికారులకు చిక్కకుండా, దొరకకుండా జరుగుతున్న ఈ మంచినీటి అక్రమ రవాణాపై స్థానికులు సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. కానీ, అక్కడకు చేరుకున్న అధికారులు చర్యలను నోటీసులకు మాత్రమే పరిమితం చేశారు. దీంతో మమ్మల్ని ఆపేదెవరు అన్న రీతిలో మంచినీటి రవాణా జరుగుతూనే ఉంది.

ఇంకిపోతున్న భూగర్భ జలాలు

నీటి అమ్మకాలు, భారీ ట్యాంకర్లతో నీటి తరలింపుతో పాటు అనుమతి లేకుండా ఇష్టానుసారంగా ఎవరు పడితే వారు బోర్లు వేసేయడంతో భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. వంద అడుగులు తవ్వినా నీరు పడకపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ముందు వరుసలో ఉన్న నివాసితులకు మంచినీరు కరువైంది. ఇక్కడి బోర్లు నుండి నీరు రాకపోవడంతో స్థానికులు ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేసుకోవలసి వస్తోంది. జీవీఎంసీ అందించే మంచినీటి మీదే తాము ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఇక్కడి వారు వాపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉందంటే భవిష్యత్తులో తాగేందుకు నీరు దొరకడం కష్టమని ఇక్కడి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న గృహ నిర్మాణాలు

ఈ ప్రాంతంలో గృహనిర్మాణాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో మంచినీటి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోక పోతే ఇక్కడ ఉన్న వారికి గుక్కెడు నీరు దొరకడం కూడా కష్టమే. వాస్తవానికి మంచినీటి అక్రమ రవాణా వాల్టా యాక్ట్‌లోకి వస్తుంది. రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు వీటిపై బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఎండాడ ప్రధాన రహదారి వెంబడి పెద్ద ఎత్తున మంచినీటి అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం స్థానికులను విస్మయపరుస్తోంది. ఇప్పటికైనా వాటర్‌ప్లాంట్ల నిర్వహణ, మంచినీటి అక్రమ రవాణాలపై జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎండాడవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మా బోర్లు పనిచేయడం లేదు

మేము ఏడు సంవత్సరాల క్రితం ఎండాడకు వచ్చాం. ఇక్కడి బోరు నుంచి మంచినీరు పుష్కలంగా వచ్చేది. కానీ, ప్రస్తుతం మా ఇంట్లో ఉన్న బోరు నుంచి పూర్తిగా నీరు రావడం లేదు. వేరే ప్రాంతానికి వెళ్లి తాగేందుకు నీరు తెచ్చుకుంటున్నాం. కొందరు మా దగ్గరలోనే నీటిని ట్యాంకర్లతో ఇతర ప్రాంతాలకు తీసుకుపోతున్నారు. అందువల్ల మేం చాలా ఇబ్బంది పడుతున్నాం.

– ఎ.సత్యవతి, ఎండాడ, బీసీ కాలనీ

అధికారులు చర్యలు తీసుకోవాలి

ప్రస్తుతం మా ప్రాంతంలో మంచినీటి సమస్య చాలా ఎక్కువగా ఉంది. ఎండాకాలం వస్తే చుక్కనీరు కూడా కష్టమే అన్నట్లుగా ఉంటోంది. వాటర్‌ప్లాంట్లు ఇష్టానుసారం ఏర్పాటు చేసేశారు. మా ప్రాంతంలో నీటిని వేరే ప్రాంతాలకు తరలించుకుపోతే ఇక్కడున్న మేమెలా బతకాలి? అధికారులు స్పందించి ఇలాంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడి తప్పదు.

– వైకుంఠరావు, ఎండాడ

మా దృష్టికి వచ్చింది

ఎండాడలో భారీ ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిని సంబంధిత ఉన్నతాధికారుల దష్టికి తీసుకుని వెళ్లి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాము.

– సురేష్, ఏఈ, మంచినీటి విభాగం

రేపటి నుంచి దసరా మహోత్సవాలు



శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి అమ్మవారు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ఎండాడ శ్రీ దుర్గ, శ్రీ సరస్వతి సమేత, శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి పద్మాలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సూరపునేని లక్ష్మీప్రసాద్ తెలిపారు. నవరాత్రులు అమ్మవారిని 9 రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 6వ తేదీ ఆదివారం చండీ హోమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ఎండాడలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

8వ వార్డు ఎండాడలోని దుర్గాదేవి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రకటనలో తెలిపారు. తొలిరోజు స్వర్ణ కవచ అలంకృత దుర్గాదేవిగా దర్శనమిస్తారని, కలశ స్థాపన చేసి పూజలు ప్రారంభిస్తామని తెలియజేశారు. 9 రోజులు 9 రూపాల్లో అమ్మవారిని అలంకరించి.. పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గంగాకుమారి

భీమునిపట్నం: ఇటీవల జరిగిన మండల స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులను ప్రిన్సిపాల్ గంగాకుమారి అభినందించారు. విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కబడ్డీలో తేజశ్రీ, నవ్యశ్రీ, ఖోఖోలో కావ్య, యోగాలో లలిత శ్రీ, పరుగు పందెంలో నిరీష బహుమతులు గెలుచుకున్నారని తెలియజేశారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థిని దీపిక కబడ్డీలో సత్తా చాటి, త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో జరగనున్న పోటీల్లో రాణించి, మరిన్ని మంచి విజయాలను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాజమాన్య కమిటీ చైర్మన్ కుమార్, వైస్ చైర్మన్ రమణమ్మ పాల్గొన్నారు.

మరింత నాణ్యమైన విద్యుత్ లక్ష్యం

మధురవాడ: మరింత నాణ్యమైన, నిరంతరాయమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ జోన్ డీఈఈ తులసి కిరణ్‌కుమార్ చెప్పారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఇబ్బందులు ఉన్నా నేరుగా సంప్రదించవచ్చన్నారు. ఇక్కడ పనిచేసిన అనిల్ కుమార్ సింహాచలం మీటర్స్ విభాగానికి బదిలీ కావడంతో, ఆయన స్థానంలో ఆనందపురం నుంచి వచ్చిన కిరణ్ కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు.

జెడ్సీకి వినతి

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస, శారదానగర్ పరిసర ప్రాంతాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వార్డు జనసేన అధ్యక్షుడు దేవర శివ కోరారు. పార్టీ నాయకులు పలువురు మంగళవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కొండవాలు ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో కాల్వలు, రోడ్ల నిర్మాణం తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు దారపు సూరిబాబు, శ్రీను, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్ పర్యటన

ఇండోర్ స్టేడియం పరిశీలన



స్టేడియాన్ని పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

భీమునిపట్నము: జీవీఎంసీ జోన్–1 పరిధిలోని భీమిలి ఇండోర్ స్టేడియంను వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ మంగళవారం పరిశీలించారు. వీఎంఆర్‌డీఏ నిర్మించిన ఈ స్టేడియంలో వసతులు, చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేడియంను బాగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–1 జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి పాల్గొన్నారు.

రోడ్డుపై వెళ్లే ‘దారేది’?



టైలర్స్ కాలనీలో రోడ్డుపైనే గృహ నిర్మాణ సామగ్రితో పాటు పార్కింగ్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ టైలర్స్ కాలనీలో ఓ వ్యక్తి ప్రభుత్వ రోడ్డును దర్జాగా ఆక్రమించి కార్ పార్కింగ్, గృహ నిర్మాణ సామగ్రి నిల్వ ఉంచుకోవడానికి వాడుకుంటున్నాడు. రోడ్డులో ఆటోలు, కారులే కాదు కనీసం ద్విచక్రవాహనాలు కూడా వెళ్లేందుకు వీల్లేకుండా చేసేశారు. వార్డు సచివాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ఇక్కడికి వెళ్లడానికి సచివాలయ సిబ్బంది కూడా వెళ్లేందుకు సాహసించడంలేదు. పేదలు చిన్న ఉల్లంఘనకు పాల్పడితేనే సహించని అధికారులు రోడ్డును ఏడాదికి పైగా ఇష్టారాజ్యంగా వాడుకుంటుంటే చూస్తూ ఊరుకోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థులకు పరీక్షలు

చెకుముకి పోటీలకు విశేష స్పందన



జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన ప్రతిభ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు





జిల్లా స్థాయి సంబరాలకు ఎంపికైన భీమిలి మండల విద్యార్థులు, ఆనందపురం మండల విద్యార్థులు

పీఎం పాలెం: విద్యార్థులలో పాఠశాల దశ నుంచి శాస్త్రీయ విజ్ఞానంపై మెరుగైన అవగాహన కల్పించడం ద్వారా మూఢాచారాలకు వ్యతిరేకంగా, మూఢ నమ్మకాలకు బలికాని నవ సమాజాన్ని నిర్మించవచ్చని రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక నాయకుడు మురళీధర్ అన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా స్థానిక సృజన స్కూల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ విజ్ఞానంపై పోటీ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని 14 పాఠశాలల నుంచి 8,9,10 తరగతులకు చెందిన 66 మంది విద్యార్థులు 22 బృందాలుగా పోటీల్లో పాల్గొన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు అప్పల రెడ్డి, నరసింహమూర్తి, రఘురామ, స్కూల్ కరస్పాండెంట్ షరీఫ్, ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపికైన 10 పాఠశాలలు

తగరపువలస: ఈ నెల 27 నుంచి విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్న జిల్లా స్థాయి చెకుముకి సంబరాలకు భీమిలి మండలం నుంచి ఏడు పాఠశాలలు, ఆనందపురం మండలం నుంచి మూడు పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు.

- భీమిలి మండలానికి సంబంధించి చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన ఎంపికల పోటీలకు 22 పాఠశాలల నుంచి 32 టీమ్‌లు పాల్గొన్నాయి. భీమిలి కేథరిన్, చిట్టివలస శారద, భీమిలి ఫ్యూచర్ ఇన్నోవేషన్స్ స్కూల్, చిట్టివలస జెడ్పీ హైస్కూల్, చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్, భీమిలి సెయింట్ ఆన్స్, భీమిలి 18వ వార్డు మున్సిపల్ హైస్కూళ్లు ఎంపికయ్యాయి. కార్యక్రమంలో భీమిలి డైట్ అధ్యాపకుడు సోమయాజులు, జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు పొట్నూరు మురళీమోహనరావు, అధ్యక్షుడు పక్కి నాగేశ్వరరావు, కార్యదర్శి నయీముద్దీన్ అన్సారీ, ప్రతినిధి మురళీధర్, ఉపాధ్యాయిని జీరు అన్నపూర్ణ పాల్గొన్నారు.
- ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఎంపిక పోటీలలో 18 పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొనగా గిడిజాల, ఆనందపురం, బోయపాలెం జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ పెద్దింటి త్రినాథరావు, ప్రధానోపాధ్యాయుడు ఆర్.కె. పట్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులంతా ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్



తాళ్లవలసలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

తగరపువలస: రైతులంతా తాము సాగు చేస్తున్న పంట వివరాలను విధిగా ఈ క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ముందుగా పంట నమోదుకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధ వారాలలో జరిగే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాల సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ సంబంధ కషాయాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రామకృష్ణ, సూక్ష్మనీటి పారుదల శాఖ పీడీ మన్మధరావు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం మోహనరావు, చెరకు పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త శ్రీలత, భీమిలి ఏడీ విజయప్రసాద్, ఏవో బి.శివకోమలి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

శొంఠ్యాంలో..

ఆనందపురం మండలం శొంఠ్యాం, మామిడిలోవ పంచాయతీలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏవో చావా సంధ్యారత్న ప్రభ రైతులకు మట్టి నమూనాల సేకరణ, ఫలితాలను విశ్లేషించారు. ప్రకృతి వ్యవసాయం గురించి అధికారి శ్రీనివాస చక్రవర్తి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ వినూత్న తదితరులు పాల్గొన్నారు.



బాందేవుపురంలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలి

పద్మనాభం: వరి పంటలో రైతులు కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం అన్నారు. మండలంలోని బాందేవుపురం, అనంతవరం పంచాయతీ గొల్లలపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలిబాటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి పైరు ఏపుగా పెరుగుతుందన్నారు. ఎరువులు, పురుగుల మందుల యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. మార్కెటింగ్ అధికారి మేరి కుమారి మాట్లాడుతూ పంటల బీమా పథకం గురించి వివరించారు. కార్యక్రమాల్లో ఏఈవో శ్రీనివాసరావు, ఎన్‌పీఎం మజ్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ముగిసిన పోలీస్ బెటాలియన్ వార్షిక తనిఖీలు



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్‌కు చెందిన వివిధ విభాగాలను స్థానిక కమాండెంట్ కేవీ మురళీకృష్ణ వార్షిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మంగళవారం పరేడ్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ గ్రౌండ్‌లో సిబ్బంది పరేడ్‌ను పీటీ, డ్రిల్, వెపన్ క్లాస్‌లు, మాబ్ ఆపరేషన్ వంటి కీలకమైన విభాగాలను పరిశీలించి సిబ్బంది కనబరిచిన ప్రతిభకు అభినందించారు. పటాలం హెడ్ క్వార్టర్, క్వార్టర్ మాస్టర్ గ్రూప్, బెటాలియన్ వెల్ఫేర్ కార్యాలయాలను పరిశీలించారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్లు పి.దేవానంద్, పి.సత్యం, జి.ఇలియ సాగర్, వి.నారాయణరావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం



మధురవాడలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మధురవాడ: విపరీతంగా మండిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు డిమాండ్ చేశారు. ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ధరల బాదుడుపై సీపీఎం ఆధ్వర్యంలో మధురవాడ మార్కెట్ వద్ద చేపట్టిన ధర్నాలో ప్లకార్డులు చేతపట్టి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ సుమారు 3 నెలలుగా ఉల్లిపాయలు, కూరగాయలతో పాటు కిరాణా సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నా కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీ యూ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.కొండమ్మ, బి.భారతి, టీకే శారద పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ పెద్దిపాలెం ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా మండలంలోని పెద్దిపాలెం, పల్లిపేట, మచ్చవానిపాలెం, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, కుసులవాడ, బంటుపల్లి కళ్లాలకు పైన తెలిపిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పద్మనాభం హైస్కూల్ విద్యార్థులు

పద్మనాభం: మండలంలోని రెండు జెడ్పీ హైస్కూళ్లకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్ర యూనివర్సిటీలో సోమ, మంగళవారాల్లో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో మద్ది జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి జి.చరణ్ తేజ అండర్–14 విభాగంలో, పదో తరగతి విద్యార్థి ఎం.లోకేష్ అండర్–17 విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం శాంతి ప్రసూన అభినందించారు.

రగ్బీకి ముగ్గురు: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం.సుస్మిత అండర్–14 విభాగంలో, పదో తరగతి విద్యార్థులు టి.పృథ్వి, కె.మేఘన అండర్–17 విభాగంలో బుచ్చియ్యపేట మండలం దిబ్బిడిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

తగరపువలస: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం తగరపువలస శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం శ్రీరమా సత్యనారాయణస్వామి కొండపై జరిగింది. సంఘం గౌరవ అధ్యక్షునిగా గోవాడ సురేష్ కుమార్, అధ్యక్షునిగా ఎర్రవరపు శంకరరావును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చిప్పాడ కనకరాజు, ఉపాధ్యక్షునిగా శిలారపు శ్రీను, సహాయ కార్యదర్శిగా గోవాడ బాబూరావు, కోశాధికారిగా పట్నాల హేమకుమార్ ఎన్నికయ్యారు. సలహా సభ్యులుగా చిప్పాడ రామకృష్ణ, శిలారపు పైడిరాజు, కాళ్లకూరి గురుమూర్తి, చిప్పాడ త్రినాథ్, గోవాడ సూర్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఏబీసీ నూతన కార్యవర్గం ఏర్పాటు

భీమునిపట్నం: అసోసియేషన్ ఆఫ్ భీమిలి క్రికెటర్స్(ఏబీసీ) నూతన కార్యవర్గం ఏర్పాటు మంగళవారం జరిగింది. అసోసియేషన్ గౌరవ అధ్యక్షునిగా గంటా రవితేజ, అధ్యక్షునిగా సన్‌స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శిగా గొలగాని నరేంద్రకుమార్, కోశాధికారిగా సంతోష్, సహ కార్యదర్శిగా అడిదం అంజనీకుమార్ ఎంపికయ్యారు.

వృద్ధులను గౌరవించాలి

తగరపువలస: వృద్ధులను గౌరవించాలని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పల రాజు విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో మంగళవారం వృద్ధుల దినోత్సవంతో పాటు శాకాహార, కాఫీ దినోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ జీవిత అనుభవాలను భవిష్యత్తు తరాలకు అందించే వృద్ధులకు ఇప్పటి తరం వారు గౌరవించడం నేర్చుకోవాలన్నారు.